66

# మెత్తని దెబ్బ

కుమార్, శంకర్ కాలేజీ విద్యార్థులు.

కుమార్ బాగా కలవారి అబ్బాయి. శంకర్ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టినవాడు. అయినా... వారి మధ్య ఎప్పుడూ కులాల కూహకంకానీ, అంతస్థుల అంతరంకాని చోటుచేసుకోలేదు. ఇద్దరూ మంచి మార్కులతో ప్యాసయ్యేవారు. ఇద్దరి ఆలోచనలూ, ఉద్దేశాలూ, ప్రవృత్తులూ ఒకేవిధంగా ఉండేవి. అందుకే ఇద్దరికీ మనసులు బాగా కలిశాయి.

ఆరోజు కుమార్ పుట్టినరోజు.

పండుగకోసం ఫంక్షన్ ఏర్పాటుచేసి ఘనంగా చేశారు. దానికి ఎందరో వచ్చారు. ఎన్నెన్నో కానుకలు ఇచ్చారు. అయితే.., కుమార్– శంకర్‌ని ఫంక్షన్‌కి పిలవకుండా ప్రత్యేకంగా ఇంటికి పిలిచాడు.

కుమార్ తల్లి ఇద్దరికీ ప్లేట్లలో మైసూర్‌పాక్ తెచ్చింది. పెద్ద ముక్క ఉన్న ప్లేట్‌ని కుమార్ ముందు, చిన్న ముక్క వున్న దానిని శంకర్ ముందు ఉంచింది.

వెంటనే కుమార్ ఆమె చూస్తూండగానే తన ప్లేట్‌ను శంకర్ ముందుంచి అందులోని ముక్కను తానే స్వయంగా శంకర్ నోటికి అందించాడు.

అదిమూసి అతని తల్లి బాధపడింది. శంకర్ వెళ్లిపోయాక కొడుకుని చివాట్లు పెట్టింది. ఈ విషయం కొందరి దగ్గర చెప్పుకుని బాధ వెళ్ళబోసుకుంది.

అది విని తోటి విద్యార్థులు 'శంకర్ దళితుడైనందువల్లే కుమార్ అతడిని అందరితో కాకుండా విడిగా పిలిచాడని' ప్రచారం చేశారు. కాని, అందరితో పిలిస్తే ప్రత్యేకత ఉండదని, అందరికంటే అతనే ఎక్కువని చూపడానికే ప్రత్యేకంగా పిలిచాడు. ఈ విషయం శంకర్‌కీ తెలుసు. అందువల్ల వాళ్ళిద్దరి మధ్యా పొరపొచ్చాలు ఏవీ రాలేదు. ఎప్పటిలాగే కలిసిమెలిసి ఉండసాగారు.



దాంతో ఆశాభంగం చెందినహరీ, మధూ వాళ్ళిద్దర్నీ ఎలాగైనా విడగొట్టాలని ప్లాన్‌వేశారు.

కాలేజీ విద్యార్థి సంఘం ఎన్నికలు సమీపిస్తున్నాయి. శంకర్ ఎందుకో ఊరు వెళ్లాడు. ఆ అవకాశం చూసి కుమార్‌ని కార్యదర్శిగా ఉండమని ప్రోత్సహించారు హరీ, మధూ.

"నాకు ఈ తలనెప్పి వద్దు బాబూ...నన్నొదిలేయండి!" అన్నాడు కుమార్.

"లేదు. ఇది శంకర్ ప్రతిపాదనే. నువ్వు నిలబడితే పోటీ ఉండదు. అందరూ కలిసుంటారు" అని నచ్చచెప్పారు.

'ఇది శంకర్ ప్రతిపాదన' అనగానే నిజమనుకొని ఒప్పుకున్నాడు కుమార్.

తనతో 'మాటమాత్రం ఎందుకు చెప్పలేదా..?' అని అనుకున్నాడు కాని, 'ఊరు వెళ్లే హడావుడిలో చెప్పలేదేమో.., తర్వాత చెబ్దామనుకున్నాడేమో...' అని సరిపెట్టుకున్నాడు.

శంకర్ ఊరినుంచి వచ్చాక- హరీ, మధూ అతని దగ్గరకెళ్లారు

"విద్యార్థి సంఘానికి నువ్వు కార్యదర్శిగా ఉండాలి. ఇది మేము అనుకోవడమే కాదు.. కుమార్ ఉద్దేశం కూడా ఇదే! నువ్వు ఊళ్ళో లేనప్పుడు కుమారే ప్రతిపాదించాడు. పైగా... ఈసారి కార్యదర్శి పదవిని దళితుడికిస్తే బాగుంటుందనుకుంటున్నాం" అన్నారు.

దాంతో శంకర్ ఉగ్రుడైపోయాడు.

"ప్రతిభ, సామర్థ్యం ఉన్న ఏ వ్యక్తి అయినా ఆ పదవిలో ఉండవచ్చు. మధ్యలో కులాల ప్రసక్తి ఎందుకు?" అంటూ గయ్యిమన్నాడు.

అతన్ని శాంతపరచి, ఇది కుమార్ ప్రతిపాదనేనని గుర్తు చేసి ఒప్పించారు. 'అది నిజంగానే కుమార్ ఉద్దేశం కాబోలు' ననుకుని ఒప్పుకున్నాడు శంకర్.

అయితే- కుమార్, శంకర్‌లకు హరీ, మధుల పన్నాగం తెలిసిరావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. వాళ్ళకి తగిన బుద్ధి చెప్పాలనుకున్నారు. పైకి మాత్రం- శత్రువులలాగా ఒకరినొకరు విమర్శించుకుంటూ ప్రచారం చేసుకోసాగారు.

ఎన్నికలరోజు వచ్చింది.

అందరికీ ఆశ్చర్యం కలిగేటట్లు కుమార్ – శంకర్ పేరు ప్రతిపాదించాడు. శంకర్ అది నిరాకరించి కుమార్ పేరు ప్రపోజ్ చేశాడు. అందుకు అతనూ నిరాకరించాడు.

అధ్యక్షులవారి అనుమతితో కుమార్ ఇలా అన్నాడు-

"మేమిద్దరం కలసిమెలసి ఉండడం చూడలేక కొందరు మమ్మల్ని విడగొట్టాలని ఈ ఎన్నికల రొంపిలోకి దింపాలనుకున్నారు. అందుకు కులాల ప్రసక్తి కూడా తెచ్చారు. కాని, మేము వారి ఆంతర్యం గ్రహించి, వారికి తగిన పాఠం నేర్పాలని పైకి ప్రత్యర్థులుగా నటించాం. ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకున్నాం. కాని, అదంతా నటన. విద్యార్థులకి కావలసింది- చదువు కాని, రాజకీయాలు కాదు. ఈ విద్యార్థి సంఘాల ఎన్నికలలో ఎన్నో కుల, మత రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. అర్థబలం, కండబలం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇందువల్ల సమాజం నాశనం అయిపోతోంది. మనకి ఇటువంటి ఎన్నికలు వద్దు. ఎక్కువ మార్కులు సాధించిన వ్యక్తినే కార్యదర్శిగా ఎన్నుకుందాం. అలాగే మిగతా పదవులూను. అప్పుడు అభ్యర్థులలో చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ ఏర్పడుతుంది. ఈ సూచనను పరిశీలించవలసిందిగా కోరుతున్నాను."

అధ్యక్షుల వారు కుమార్ సూచనను పరిశీలించి , 'భవిష్యత్తులో ఎలా ఉండాలో నిర్ణయించుకొండని' సూచించారు.

అభ్యర్థులు లేని కారణంగా, ఎన్నికలను వాయిదా వేస్తూ తదుపరి కార్యక్రమం చేపట్టారు.

★★★